క్లుప్తంగా

కుష్ఠు నివారణే లక్ష్యం



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటప్రసాద్

బైరెడ్డిపల్లె: కుష్ఠు వ్యాధిని నివారించడమే ఆరోగ్యసిబ్బంది లక్ష్యమని జిల్లా వైద్యాధికారి వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని తీర్థం పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. అనంతరం కుష్ఠు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్యసిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు అనిల్, అరుణ్‌కుమార్, డీపీఎంఓ జాన్ పాల్గొన్నారు.

ఉసిరి ప్రయోజనాలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ కరీముల్లా

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉసిరి ఆరోగ్య ప్రయోజనాలపై రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా దంపతులు గురువారం అవగాహన కల్పించారని హెచ్ఎం జయకుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన 175 కిలోల ఉసిరి కాయలను వారు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. ఉసిరితో అనేక ఔషధ ప్రయోజనాలు ఉన్నట్లు వారు వివరించారని తెలియజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన ప్రతాప్‌కుమార్

పలమనేరు: బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని మండిపేట కోటూరుకు చెందిన ప్రతాప్‌కుమార్(25) గురువారం బైక్‌లో పలమనేరుకు బయలుదేరాడు. మండిపేట కోటూరు సమీపంలో వెళుతుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌లో వెళుతున్న ప్రతాప్‌కుమార్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ నరసింహరాజు కేసును విచారిస్తున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: పట్టణంలో రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, నీటి విభాగపు అధికారులతో సమీక్షించారు. కాలువపల్లి జలాశయం డీపీఆర్‌కు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

జెర్సీ ఆవులతో అధిక పాల దిగుబడి



కూర్మాయిపల్లెలో రైతులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్

బంగారుపాళెం: జెర్సీ ఆవులతో అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రభాకర్ అన్నారు. గురువారం మండలంలోని కూర్మాయిపల్లె గోపాలమిత్ర కేంద్రం ఆవరణలో పశుసంతతి పరిశీలనా పథకం ద్వారా పుట్టిన సంకర జాతి జెర్సీ పేయ దూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడారు. పేయదూడల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. పీటీపీ పేయదూడలు, కోడెదూడల ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో 70 దూడలను ప్రదర్శనగా ఉంచారు. ఈప్రదర్శనలో ఉత్తమ పేయదూడలను అధికారులు ఎంపిక చేసి యజమానులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఈసందర్భంగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ ఆరిఫ్, బాలసుబ్రమణ్యం, సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ ఆసీఫ్, నలగాంపల్లె పశువైద్యాధికారి రూన్సీ, సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

లేఔట్లు.. పాట్లు

- అక్రమ లేఔట్లలో స్థలాలు కొనొద్దన్న అధికారులు
- అప్రూవల్ స్థలాలంటూ మోసం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- కొండెక్కనున్న రియల్ వ్యాపారాలు





మున్సిపాలిటీలో అక్రమ లేఔట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి, (ఇన్‌సెట్) పలమనేరులో అక్రమ లేఔట్లకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న అధికారులు

పలమనేరు: మున్సిపల్ అధికారుల హెచ్చరికలతో ఇప్పటికే అక్రమ లేఔట్లలో స్థలాలు కొన్నవారిపై పిడుగు పడినట్లు అయ్యింది. నిబంధనలు పాటించని లేఔట్లలో స్థలాలు కొన్నప్పటికీ భవిష్యత్తులో అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు చేపట్టేది లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. లేఔట్‌కు సంబంధించిన అనుమతులు లేనప్పటికీ కొందరు రియల్ దళారుల మాట విని స్థలాలు కొన్నవారు ఇప్పుడు ఏం చేయాలో అర్థంగాని పరిస్థితి పలమనేరు నియోజకవర్గంలో నెలకొంది. ఇలాఉండగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల ఆదేశాలతో రియల్ వ్యాపారాలు పూర్తిగా స్తంభించడం గ్యారెంటీగా కనిపిస్తోంది. ఎందుకంటే నియోజకవర్గంలో 180 దాకా లేఔట్లుండగా వీటిలో సంబంధిత పంచాయతీ లేదా మున్సిపాలిటీల నుంచి అనుమతులు పొందిన లేఔట్లు కేవలం 20 కూడా లేవు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు అక్రమ లేఔట్లను తనిఖీ చేసి వాటి వద్ద హెచ్చరిక బోర్డులను నాటించారు. దీంతో వీటిల్లో ఇళ్ల స్థలాలు కొన్న వారికి కంటిమీద కునుకు లేకుండా పోయింది.

అప్రూవల్ లేకున్నా క్రయవిక్రయాలు..

ఓ భూమిని నలుగురు భాగస్వాములుగా కొని కొంత బయానా చెల్లించి అగ్రిమెంట్‌తోనే భూమిని చదునుచేసి రాళ్లు నాటి స్కెచ్ చేతబట్టి సైట్ల అమ్మకాలు సాగించేస్తున్నారు కొందరు లేఔట్ యజమానులు. ఇలాంటి నిబంధనలు పాటించని లేఔట్లను కొన్న వ్యక్తులు ఆపై ఇంటి నిర్మాణం చేసేందుకు పడరాని పాట్లు పడి మళ్లీ అధికంగా డబ్బులు ఖర్చుచేసి అనుమతులు పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన గత ప్రభుత్వం లేఔట్ల విషయంలో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఆమేరకు అన్ని అనుమతులున్న లేఔట్ సైట్లను మాత్రమే క్రయవిక్రయాలు జరపాలంటూ సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయాలకు కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కొందరు కోర్టులకు వెళ్లడంతో రిజిస్ట్రేషన్లకు, అనుమతులకు సంబంధం లేదని కోర్టు చెప్పింది. దీంతో మళ్లీ అనుమతులు లేని లేఔట్లలో సైట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. కొనే ముందు రియల్ దళారుల మాయమాటలను నమ్మి కొన్నాక గానీ అనుమతులు లేవనే విషయం బాధితులకు తెలియడం లేదు.

ఇప్పటిదాకా జరిగిందిలా....

పలమనేరు నియోజకవర్గంలో 180 దాకా లేఔట్లున్నాయి. వీటిలో 80 శాతం దాకా ఇప్పటికే అమ్మకాలు సాగాయి. ఇందులో 160 దాకా అప్రూవల్ లేనివే. ఇక గ్రామాల్లో అయితే వ్యవసాయభూములుగానే ఉండి సైట్లను విక్రయించిన లేఔట్లున్నాయి. మరికొన్ని పంచాయతీ స్థాయిలో అనుమతులుండి ఆపై డీటీసీపీఓ అనుమతులు లేనివి ఉన్నాయి. గతంలో విక్రయించిన కొన్ని లేఔట్లలో కరెంటు, నీటి సౌకర్యం లేనివి ఉన్నాయి. కనీసం 10 నుంచి 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉన్నవి కొన్ని ఉన్నాయి. భూముల రిజిస్ట్రేషన్ నిషేధంలో ఉన్న సైట్లున్నాయి. నిమ్మ జాతి కండిషన్ భూములను సైతం లేఔట్లు చేసి అమ్మేశారు. ఇలాంటి స్థలాలను కొన్న వారు ఇప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. లేఔట్‌లు వేసేటప్పుడే సంబంధిత మున్సిపాలిటీ, పంచాయతీలు తగిన చర్యలు తీసుకోకపోవడమే ఈ అనర్థాలకు కారణమైందనే మాట గట్టిగా వినిపిస్తోంది. ఆదిలోనే వీటిని ఆపేసుంటే తాము కొనేవాళ్లమే కాదని కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ఇప్పటికే అక్రమ లేఔట్లలో స్థలాలు కొన్నవారికి లక్షలు వెచ్చిస్తేగానీ ఇంటి నిర్మాణాలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా అనధికారిక లేఔట్లపై చర్యలు తప్పవన్నారు. టీపీఓ ఇందిరతో కలసి పలు అక్రమ లేఔట్లను పరిశీలించామని ఇక్కడున్న వాటిల్లో 90శాతం లేఔట్లకు ఇప్పటిదాకా అనుమతులు లేవని గుర్తించామన్నారు. వీరికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతులు లేని లేఔట్లలోని ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని తెలిపారు. దీంతోపాటు ఈ సైట్ల క్రయవిక్రయాలు సైతం ఇకపై సాగవని స్పష్టం చేశారు.

లేఔట్ నిబంధనలు ఇలా..

ఎవరైనా లేఔట్ వేయాలంటే వ్యవసాయభూమిని(గ్రీన్‌బెల్ట్) వ్యవసాయేతరభూమి (ఎల్లో బెల్ట్)గా మార్చుకోవాలి. ఆపై గ్రామాల్లో అయితే పంచాయతీ, రెవెన్యూశాఖల ద్వారా డిస్ట్రిక్ టౌన్‌కంట్రీ ఆఫీసర్ ద్వారా, పట్టణాల్లో అయితే మున్సిపాలిటీ ద్వారా డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్(గుంటూరు) ద్వారా అప్రూవల్స్ పొందాలి. అధీకృత ప్లాన్ ఇంజినీర్ ద్వారా లేఔట్ స్కెచ్ వేయించాలి. ఆపై నిర్దేశించిన లేఔట్‌లో విస్తీర్ణంలో 12.5 శాతం(రిజర్వు ఏరియా, కమ్యూనిటీ కోసం) గ్రామాల్లో పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు సంబంధిత అధికారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించాలి, లేదా ఆస్థలం మార్కెట్ విలువలో 10 నుంచి 12శాతం నగదును చెల్లించాలి. లేఔట్‌లో ప్రధాన వీధులు 35 నుంచి 40 అడుగులు వాటికి అప్రోచ్ రోడ్లు కచ్చితంగా ఉండాలి. లేఔట్‌లో నీటి సౌకర్యం, డ్రైన్లు, కరెంటు లాంటి మౌలిక సదుపాయాలుండాలి. ఆపై గ్రీనరీలాంటివి కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

జోనల్ స్పోర్ట్స్‌మీట్ రేపు

పుంగనూరు: పట్టణంలోని భాష్యం పాఠశాలలో ఈనెల 8న జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం సుబ్రమణ్యం గురువారం తెలిపారు. భాష్యం విద్యాసంస్థలతో నిర్వహిస్తున్న స్పోర్ట్స్‌మీట్‌లో మదనపల్లె, తిరుపతి, పుంగనూరు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. స్పోర్ట్స్‌మీట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై చర్యలు తీసుకోండి



కొత్తఇండ్లలో పేరుకుపోయిన చెత్త

పుంగనూరు: పట్టణంలో పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని కొత్తఇండ్లలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం వెనుకవైపు ఉన్న వీధిలో ఎక్కువడితే అక్కడ చెత్తదిబ్బలు ప్రత్యక్షమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. చెత్తదిబ్బలు పేరుకుపోవడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, చెత్త చెదారం ఇళ్లలోకి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి వీధిలోనూ డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

9న కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె: జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 9న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యాధికారులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నూతన వధూవరులు అమరనాథరెడ్డి, అర్చనరెడ్డిలను ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆశీస్సులు..

పుంగనూరు: పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం వివిధ శుభకార్యాల్లో పాల్గొన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నేత చంద్రశేఖర్, వ్యాపారవేత్త సుబ్రమణ్యం ఇంటి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చంద్రమాకులపల్లెకు చెందిన జయనారాయణరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో, చౌడేపల్లె మండలం అంకుతోటపల్లెకి చెందిన భాస్కర్‌రెడ్డి కుమారుడు అమరనాథరెడ్డి, అర్చనరెడ్డిల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువరూలను ఆశీర్వదించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మాజీ ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగభూషణం, బైరెడ్డిపల్లి రెడ్డెప్ప, మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, కొత్తపల్లి చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి వరాలు



మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న నేతలు

పుంగనూరు: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు వరాలు కురిపించినట్లు బీజేపీ నేతలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కూడలిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జగదీష్‌రాజు, నేతలు నరసింహులు, బాబు పాల్గొన్నారు.

కూలేదాకా పట్టించుకోరా!

గంగవరం: మండలంలోని మామడుగు గ్రామంలో ఓ వీధిలో విద్యుత్ స్తంభం నెరులు చీలి కూలేందుకు సిద్ధంగా ఉంది. స్తంభం కింది నుంచి పైవరకు పాడుబడి శిథిలావస్థకు ప్రమాదవశాత్తు నేల కూలితే జరిగే పరిణామానికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలంటూ పలువురు ఆరోపిస్తున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు నిత్యం నడకసాగించే వీధిలో స్తంభం నేల కూలితే కరెంటు తీగలు తెగి విద్యుత్ తాకిడికి ఎంతటి దారుణం జరుగుతుందో అంటూ స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభం మార్చాలంటూ గతంలో పలుమార్లు విద్యుత్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోలేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించాలంటూ ప్రజలు కోరుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు 15వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారు పట్టణ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించరూ!

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణలో పెన్షనర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ప్రయోజనాలను అధికారులు తెలియజేయాలన్నారు. అనంతరం పెన్షనర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు రామ్మూర్తి, కుమారవర్మ, నారాయణస్వామి, ఏకాంబరనాయుడు, కోదండనాయుడు, పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ లాక్స్‌పై పోలీసుల అవగాహన

యాదమరి (కాణిపాకం): యాదమరి మండలంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఎస్ఐ ఈశ్వర్ స్మార్ట్ లాక్స్‌పై అవగాహన కల్పించారు. చోరీల నివారణకు ఈ స్మార్ట్ లాక్స్ ఉపయోగపడుతాయని, అవసరమైన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే వీటిని ఇస్తామన్నారు. ప్రజలు స్మార్ట్ లాక్స్ ఏర్పాటు చేసుకుని తమ ఇళ్లలో చోరీలు జరగకుండా చెక్ పెట్టవచ్చన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి



ఎంపీడీఓతో సమావేశమైన వైద్యాధికారులు

గంగవరం: ఈనెల 10వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో వైద్యశాఖతో పాటు విద్య, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో పాల్గొనాలని వైద్యశాఖ పిలుపునిచ్చింది. ఆమేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖలు ఎంపీడీఓ సురేష్‌బాబుతో సమావేశమయ్యారు. మండలంలో 12వేలకు పైగా పిల్లలకు కడుపులో నులి పురుగులు నివారించే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్టు వైద్యులు తెలిపారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.



మండలంలో పలువురు ఉలవలు సాగు చేశారు. చేతికొచ్చిన పంట కోతలు కోసి నూర్పిళ్ల కోసం రోడ్లను ఉపయోగిస్తున్నారు. ఉలవ పంటను రోడ్లపై అడ్డంగా వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -సదుం

డిజిటల్ మిథ్య

- టీవీలకు అందని జియో నెట్‌వర్క్
- అలంకారప్రాయంగా పాఠశాలలో టీవీలు
- చోద్యం చూస్తున్న అధికారులు



చిచ్చిలివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా జియో నెట్‌వర్క్ పరికరాలు



చిచ్చిలివారిపల్లెలో బయట చదువుకుంటున్న విద్యార్థులు

రొంపిచెర్ల: కేంద్ర ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం డిజిటల్ విద్యను అమలు చేస్తోంది. డిజిటల్ విద్యాబోధనకు ఎంపికైన పాఠశాలలకు ప్రభుత్వం టీవీలను, జియో నెట్‌వర్క్ కనెక్షన్ ఇచ్చారు. అయితే కొన్ని పాఠశాలల్లో జియో నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయకపోవడంతో డిజిటల్ విద్యాబోధన ప్రారంభం కాలేదు. రొంపిచెర్ల మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొదటి విడత నాడు–నేడు పథకంలో ఎంపికైన 8 ఉన్నత, 12 ప్రాథమిక పాఠశాలలకు డిజిటల్ విద్యాబోధనకు ఎంపిక చేశారు. ఒక పాఠశాలకు రూ.30 వేలు నుంచి 90 వేల వరకు పెట్టి స్మార్ట్ టీవీలను కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. అలాగే మరో రూ.11వేలు ఖర్చు చేసి సంవత్సరం పొడుగునా జియో నెట్‌వర్క్‌తో విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి ఖర్చు చేశారు. అయితే మండలంలోని చిచ్చిలివారిపల్లె ప్రాథమిక పాఠశాల, మోటుమల్లెల గ్రామ పంచాయతీలోని బాలనాగిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో టీవీలు బిగించి జియో నెట్‌వర్క్ కనెక్షన్ ఇచ్చారు. కనెక్షన్ ఇచ్చి 6 నెలలు అవుతున్నా ఇంతవరకు ఒక్క రోజు కూడా టీవీలు ఆన్ చేసిన పాపాన పోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. కేంద్రప్రభుత్వం పేద విద్యార్థుల కోసం నిధులు ఖర్చు చేస్తున్నా సంబంధితశాఖ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని డిజిటల్ విద్యాబోధనకు కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండలంలోని చిచ్చిలివారిపల్లె, బాలనాగిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన జరగడం లేదనే విషయం నిజమే. రెండు పాఠశాలల్లో జియో నెట్‌వర్క్ కనెక్షన్ పనిచేయడం లేదు. దీని కారణంగా అక్కడ డిజిటల్ విద్య కుంటుపడింది. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తా.

–ఎంఈఓ, శ్రీనివాసులు

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చౌడేపల్లి: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన రోగులకు కోలార్ ఆర్ఎల్ జాలప్ప ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి స్వగ్రామాలకు తరలించేలా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.